క్లుప్తంగా

'ట్రినిటి'లో ఫ్రెషర్స్ డే



అభినందిస్తున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ట్రినిటి జూనియర్ కాలేజీ విద్యార్థులు శనివారం ఫ్రెషర్స్‌డే జరుపుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ ఓదెలు, అనిల్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రాజు

మంథని: గ్రామంలో ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని మంథని బి.సీఐ రాజు హెచ్చరించారు. మండలంలోని గుంజపడుగులో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామ ప్రజలతో సీఐ సమావేశమై స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనదారులను గుర్తించి చలాన్లు వేశారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మంథని, రామగిరి ఎస్సైలు రమేశ్, చంద్రకుమార్ ఉన్నారు.

క్షీరాభిషేకం

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న 25వేలకుపైగా కాంట్రాక్ట్ కార్మికులకు దసరా కానుకగా లాభాల వాటాలో ప్రతీ కాంట్రాక్ట్ కార్మికునికి రూ.5వేలు చెల్లించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలో కాంట్రాక్ట్ కార్మికులు సీఎం, మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

పిచ్చిమొక్కలు, చెట్లు తొలగించారు



కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సాక్షి ఎఫెక్ట్..

కమాన్‌పూర్: కమాన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం భవనం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించారు. ఈ నెల 15న సాక్షి దినపత్రికలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, చెట్లు పెరిగిపోయాయి అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించడంతో పీహెచ్‌సీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

ఓదెల: మండలంలో ఓదెల, మడక గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష రూ.4లక్షలు మంజూరు చేసినట్లు పీఆర్ ఏఈఈ జగదీష్ శనివారం తెలిపారు. మండలంలో ఇటీవల కలెక్టర్ పర్యటించిన విషయం తెలిసిందే. మడక గ్రామంలో శిథిలావస్థలోకి చేరిన పాఠశాల పైకప్పు తొలగించి తిరిగి నిర్మాణం కోసం రూ.2లక్షలు, మోడల్‌స్కూల్‌కు వెళ్లే బురదరోడ్డు నిర్మాణానికి రూ.2లక్షలు మంజూరు చేసినట్లు ఏఈఈ పేర్కొన్నారు.

సిద్ధాంతాలు వివరించి బీజేపీ సభ్యతం అడగాలి

రామగిరి: సిద్ధాంతాలను వివరించి బీజేపీ సభ్యత్వం తీసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా ప్రముఖ్ క్యాతం వెంకటరమణ కార్యకర్తలను కోరారు. సెంటనరీకాలనీలోని బీఎంఎస్ కార్యాలయంలో శనివారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్, నియోజకవర్గ సభ్యత్వ సహాయ ఇన్‌చార్జి మచ్చగిరి రాము, పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు సన్మానం

ముత్తారం: మండలంలోని ధర్యపూర్ మోడల్ స్కూల్‌లో ఇటీవల బదిలీ అయిన ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులను శనివారం మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ సన్మానించారు.



గోదావరిఖని: జూనియర్ కాలేజ్‌లో..

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

కమాన్‌పూర్: మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



జూలపల్లి: పద్మశాలీ సంఘం నాయకులు

జూలపల్లి: తెలంగాణ ఉద్యమ యోధుడు కొండా లక్ష్మన్ బాపూజీ వర్ధంతిని జూలపల్లి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం స్థానిక మార్కండేయ స్వామి ఆలయంలో లక్ష్మన్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.



కమాన్‌పూర్: నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జీడి కనకయ్య ఉన్నారు.

శబ్ద కాలుష్యం చేస్తే కఠిన చర్యలు

గోదావరిఖని: ద్విచక్రవాహనాలు అధిక శబ్దం చేసే సైలెన్సర్లు బిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులకు పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో అధిక శబ్దం కలిగించే సైలెన్సర్ ఉన్న వాహనాలను వెంటనే మార్చుకోవాలని సూచించారు. లేని పక్షంలో తనిఖీల్లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మెకానిక్ షాప్ ఓనర్లు, ఆటో స్టోర్ యజమానులు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు రిపేర్ చేయొద్దని, సైలెన్సర్లు అమ్మరాదని, ఒకవేళ అమ్మితే చట్టపకారం చర్య తీసుకుంటామన్నారు. ఎస్సై హరిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రాజేంద్రప్రసాద్

విద్యార్థులతో ఏసీపీ సమావేశం



మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

గోదావరిఖనిటౌన్: స్థానిక అశోక్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. కొన్ని రోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లోని పైపులైన్లను, తలుపులను, వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి ప్రభుత్వ ఆస్తులను నష్టపరిచారని గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఈ విషయంలో దర్యాప్తు ప్రారంభించామని ఆయన తెలిపారు. ఎవరైనా పాఠశాలలోకి అక్రమంగా ప్రవేశించి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే వారిని కఠినంగా శిక్షిస్తామని ఆయన తెలిపారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, పాఠశాల టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు బల్దియా కమిషనర్ బాధ్యతలు

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఐదురోజులు సెలవు పెట్టడం, రెండు రోజుల్లోనే వరుసగా ఇద్దరు అధికారులకు ఐదురోజుల కోసం ఇన్‌చార్జి కమిషనర్ బాధ్యతలు అప్పగించడం బల్దియాలో చర్చనీయాంశంగా మారింది. సెలవుపై వెళ్లిన శ్రీకాంత్, తిరిగి విధుల్లో చేరకపోవచ్చని, మరో ప్రాంతానికి బదిలీ కోసమే కమిషనర్ సెలవు పెట్టి ఉంటారని జోరుగా ప్రచారం సాగుతోంది. కాగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె.అరుణశ్రీకి, నగరపాలక సంస్థ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శనివారం అరుణశ్రీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత కమిషనర్ శ్రీకాంత్ ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు సెలవు పెట్టారు. ఈనెల 25న కమిషనర్ శ్రీకాంత్ తిరిగి విధుల్లో చేరుతారా, లేకుంటే సెలవు పొడిగింపు కోరుతారా? అనేది బల్దియాలో చర్చ జరుగుతోంది.

లేబర్‌కోడ్‌ల రద్దుకు ఐక్యంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం పిలుపునిచ్చారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017 నుంచి వేతనాల సవరణ లేక కాంట్రాక్టు కార్మికులంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నాయకులు జూపాక శ్రీనివాస్, తోకల రమేశ్, జాడి దేవరాజ్, జిందం రాంప్రసాద్, ఆడెపు శంకర్, మార్త రాములు, ఇనుగాల రాజేశ్వర్, కలవల రాయమల్లు, భీమయ్య, తూళ్ల శంకర్ పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన పెద్దపల్లి ఎమ్మెల్యే

ఓదెల: హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు శనివారం కలిశారు. మండలంలోని కొలనూర్‌కు చెందిన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్ టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానించారు. కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు కొమురయ్యగౌడ్, గౌడ సంఘం నాయకులు సత్తయ్యగౌడ్, అబ్బయ్యగౌడ్, సునీల్‌గౌడ్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంత్రి కృషితోనే కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా

రామగిరి: రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు కృషితోనే సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా లభించిందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య అన్నారు. సెంటనరీకాలనీలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి చరిత్రలో మొట్టమొదటిసారిగా మంత్రి ప్రత్యేక చొరవతో కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేలు బోనస్ ప్రకటించారన్నారు. కాంగ్రెస్ కార్మికుల పక్షపాతిగా ఉంటుందని, కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పన్నూర్ మాజీ ఎంపీటీసీ చిందం మహేశ్, నాయకులు మైదం వరప్రసాద్, వేపచెట్టు రాజేశ్, కన్నూరి నర్సింగరావు, మైదం బుచ్చయ్య, చింతల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తోట చంద్రయ్య

దమ్మున్న ప్రతినిధిని ఎన్నుకోండి

పెద్దపల్లిరూరల్: 'పట్టభద్రుల సమస్యలు శాసన మండలిలో గళంవిప్పే దమ్మున్న ప్రతినిధిని ఎన్నుకోండి' అని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. పెద్దపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, ప్రవేట్ జూనియర్ కళాశాలలో శనివారం ఆయన మాట్లాడారు. తనకు అండగా నిలిచి గెలిపించాలని పట్టభద్రులను, లెక్చరర్లు, ఉపాధ్యాయులను కోరారు. గర్రెపల్లి మాజీ సర్పంచ్ పడాల అజయ్‌గౌడ్, స్టూడెంట్ జేఏసీ జిల్లా కోకన్వీనర్ సుర శ్యామ్, రవీందర్, రాజేశ్, నరేశ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌశిక హరి నివాసం ఎదుట పోలీసుల పహారా

రామగుండం: రైతు రుణమాఫీ, రైతుబంధు నిధులు విడుదల చేయాలనే డిమాండ్ మేరకు శనివారం పాలకుర్తి మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్మిక సంఘం ప్రతినిధి కౌశిక హరి రైతు ధర్నాకు పిలుపునిచ్చారు. పోలీసులు ముందస్తుగా కౌశిక హరిని హౌస్ అరెస్టు చేయాలని వేకువజామున రామగుండంలోని కౌశిక హరి నివాసానికి పోలీసులు చేరుకున్నారు. ముందే గ్రహించిన కౌశిక హరి ఒకరోజు ముందే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం తెలిసింది. ఎన్టీపీసీ, ధర్మారం ఎస్సైలు కందునూరి సతీశ్‌కుమార్, లక్ష్మణ్, రామగుండం ఏఎస్సై పోలీసు బలగాలతో ఉదయం 10గంటల వరకు పహారా నిర్వహించారు. కౌశిక హరి ఇంట్లోనే ఉన్నాడనే అనుమానంతో పోలీసు బలగాలు ఆయన సతీమణి, స్థానిక కార్పొరేటర్ కౌశిక లత బెడ్‌రూం డోర్ కొట్టారు. కనీసం లేడీ కానిస్టేబుల్ లేకుండా ఒంటరిగా ఉన్న మహిళా నాయకురాలి ఇంట్లోకి చొచ్చుకురావడం పోలీసుల అమానుష చర్య అని బీఆర్ఎస్ నాయకులు మద్దికుంట శంకర్, దారంగుల కుమార్, కుక్క గంగాప్రసాద్, కుమార్, శెట్టి రాజశేఖర్ అన్నారు.

సంక్షిప్త వార్తలు

• కార్మికసంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

పెద్దపల్లిరూరల్: భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాల అమలు బాధ్యతలను పర్యవేక్షించేందుకు కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు కోరారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో శనివారం ఏవో శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాదబీమా, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం పథకాలను బీమా కంపెనీలకు అప్పగించి బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

• ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడిగా కుమారస్వామి

సుల్తానాబాద్: గ్రామీణ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడిగా కొడుదుల కుమారస్వామిని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల మల్లేశం ప్రకటించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా కోడూరి శారద, జనరల్ సెక్రటరీగా నల్లగొండ రమేశ్‌గౌడ్, కోశాధికారిగా శీలం లక్ష్మణ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

• 24న ఎస్‌జీఎఫ్ జోనల్ లెవల్ టోర్నమెంట్

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని రేగడిమద్దికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుల్తానాబాద్, ఓదెల, ఎలిగేడు, జూలపల్లి మండలాలకు 24న ఎస్‌జీఎఫ్ జోనల్ లెవల్ టోర్నమెంట్ నిర్వహించనున్నటు పీఈటీ రమేశ్ తెలిపారు. 24న అండర్–14, అండర్–17 విభాగంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు, 25న సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బాల బాలికలకు ఖోఖో, అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 94906 74874 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

• సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 23న తలపెట్టిన చలో సంక్షేమభవన్ హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ అన్నారు. పెద్దపల్లిలోని కార్యాలయంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో ఉండే విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దూరం చేసేలా కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాస్మోటిక్ బిల్లులు అందడం లేదని, ప్యాకెట్‌మనీ రూ.వెయ్యి అందించాలని కోరారు. వసతిగృహాల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందని ఆరోపించారు. నాయకులు శ్రావణ్, నవీన్, శేఖర్, అశోక్, రమేశ్ పాల్గొన్నారు.

• హెల్త్ సబ్ సెంటర్‌కు నిధులు మంజూరు

ముత్తారం: ముత్తారంలోని హెల్త్ సబ్ సెంటర్ రూ.20లక్షల నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి శ్రీధర్‌బాబు, నాయకుడు శ్రీనుబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

• ఉచిత వైద్య శిబిరం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ కార్పొరేటర్ సోమారపు లావణ్య ప్రారంభించారు. కాలనీవాసులకు డాక్టర్ వనజ రాహుల్, డాక్టర్ లక్ష్మీవాణి వైద్య పరీక్షలు నిర్వహించారు.

• న్యాయవాదులందరికీ హెల్త్‌కార్డులు వర్తింపజేయాలి

గోదావరిఖనిటౌన్: 2019 జూన్ తర్వాత బార్ కౌన్సిల్ నమోదు చేసుకున్న న్యాయవాదులందరికీ హెల్త్‌కార్డులు వర్తింపజేయాలని ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చందాల శైలజ కోరారు. ఐలు నిర్ణయం మేరకు న్యాయవాదులకు రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ ఇచ్చే హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదన్నారు. ఇందుకుగాను గోదావరిఖని అధ్యక్ష, కార్యదర్శులు ఆసంపెల్లి రవికుమార్, రామటెంకి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర లా సెక్రటరీకి పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు.

• మొక్కల పరిశీలన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి, గోలివాడ గ్రామాల శివారులోని ఇరిగేషన్ శాఖకు చెందిన ప్రభుత్వ భూమిలో గతేడాది నాటిన మొక్కల స్థితిగతులను శనివారం ఉపాధిహామీ ఏపీవో రమేశ్ పరిశీలించారు.

• దరఖాస్తుల ఆహ్వానం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల మోడల్ స్కూల్లో గంటల ప్రాతిపదికన బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు ఒక ప్రకటనలో కోరారు. ఖాళీగా ఉన్న ఆంగ్లం, సివిక్స్, అర్థశాస్త్రం, తెలుగు బోధించడానికి అర్హులైన వారు 24లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

• ఇసుక లారీలు పట్టివేత

ఓదెల: మండలంలోని మానేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలను పొత్కపల్లి పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఆయా లారీలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై జి.అశోక్‌రెడ్డి తెలిపారు. సుల్తానాబాద్ పోలీసులు ఇసుక లారీలను పట్టుకున్నారని, అక్కడ స్థలం లేనందున పొత్కపల్లికి తరలించారని పొత్కపల్లి ఎస్సై పేర్కొన్నారు.

• వరిపంటల పరిశీలన

ఓదెల: మండలంలో వరిపంటకు సోకిన ఎండుతెగుళ్ల నివారణకు ప్రైస్టోసైక్లిన్, హైడ్రాక్సైడ్‌ను వాడాలని మండలం వ్యవసాయాధికారి భాస్కర్ తెలిపారు. మండలంలోని గోపరపల్లె, ఓదెల గ్రామాల్లో శనివారం వరిపంటలను పరిశీలించారు.

కమాన్‌పూర్ మండలంలో..

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి, నాగారం, సిద్ధిపల్లెలో రైతులు సాగుచేసిన వరి పంటను శనివారం మండల వ్యవసాయాధికారి రామకృష్ణ పరిశీలించారు. వరిలో వస్తున్న వివిధ రకాల చీడపీడలను గుర్తించి నివారణ కోసం రైతులకు సలహాలు సూచనలు చేశారు.



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ ప్రధాన చౌరస్తాలో పశువులు రోడ్డుపై నిద్రించడంతో ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్డుపై సంచరిస్తున్న పశువులను బంజరుదొడ్డికి తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వాట్సప్ చేయండి..

మా ఫోన్ నంబర్ : 97053 46608

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

సింగరేణి వార్తలు

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలి

గోదావరిఖని: క్రమశిక్షణతో ముందుకు సాగి ఉద్యోగంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆర్జీ–1 జీఎం డి.లలిత్‌కుమార్ అన్నారు. జీఎం కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో 17మందికి ఆయన కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుకూలంగా పని నైపుణ్యాన్ని మెరుగుపరచుకొని కంపెనీ పురోభివృద్ధికి పాటుపడాలన్నారు. సింగరేణి భవిష్యత్ యువ ఉద్యోగుల చేతుల్లో ఉందని, ప్రతీఒక్కరు సంస్థ కోసం కష్టించి పనిచేయాలని సూచించారు. సంస్థ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. అధికారులు కిరణ్‌బాబు, రవీందర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం లలిత్‌కుమార్

లాభాల వాటా చెల్లింపులో కార్మికులకు అన్యాయం

గోదావరిఖని: లాభాల వాటా చెల్లింపులో సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగిందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రతీ కార్మికుడికి రూ.4లక్షలు రావాల్సి ఉండగా, ప్రభుత్వం చేసిన మోసానికి గెలిచిన కార్మిక సంఘాలు వంత పాడటంతో రూ.రెండు లక్షలకు లాభాలు కుదించబడ్డాయన్నారు. లాభాల వాటా చెల్లింపుపై ప్రభుత్వం, సింగరేణిలో గెలిచిన సంఘాల నాయకులు చేసిన మోసాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్మికులకు జరిగిన ఆర్థిక నష్టంపై కలిసి వచ్చే కార్మిక సంఘాలను కలుపుకొని పోరాడతామని పేర్కొన్నారు. నాయకులు మాదాసి రామ్మూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, పోలాడి శ్రీనివాసరావు, వాసర్ల జోసెఫ్, చల్ల రవీందర్‌రెడ్డి, బొగ్గుల సాయి, రాజ్‌కుమార్, పల్లె సురేందర్, జనగామ మల్లేశ్, పులిపాక శంకర్, రొడ్డ సంపత్, సతీశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ యూనియన్ పనిచేస్తుందని ఐఎన్‌టీయూసీ సంఘం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతం మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో సింగరేణి లాభాల వాటాలో 33శాతం రూ.796కోట్లు ఉద్యోగులకు ఇప్పించడంతో పాటు మిగిలిన రూ.2289 కోట్లు సింగరేణి అభివృద్ధికి ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి చరిత్రలోనే మొదటిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల వాటాలో రూ.5వేలు చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఐఎన్‌టీయూసీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 ఏరియా వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి, దాస్, అక్బర్ అలీ, అక్రమ్, సంపత్‌రెడ్డి, దశరథంగౌడ్, రాములు, సురేశ్, రవీందర్, రాయమల్లు, సదానందం పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ నాయకుల సంబరాలు

రామగిరి: సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం లాభాల వాటా ప్రకటించినందుకు శనివారం ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో ఐఎన్‌టీయూసీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఆర్జీ–3 డివిజన్ అధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. సింగరేణి కార్మికులకు లాభాల్లో 33శాతం వాటా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, మినిమమ్ వేజ్‌బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పిట్ సెక్రటరీ రామిండ్ల మనోహర్, నాయకులు వెంకటేశ్వర్లు, బత్తుల రమేశ్, బద్దార్థి సదానందం, తిలక్ ప్రియ, శాంతిప్రియ పాల్గొన్నారు.



సంబరాల్లో ఐఎన్‌టీయూసీ నాయకులు

కార్మికుల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తాం

గోదావరిఖని: ఏఐటీయూసీ కృషితోనే సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మొదటిసారిగా లాభాల వాటా హక్కు సాధించుకున్నామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రానున్న రోజుల్లో స్ట్రక్చర్ మీటింగ్‌లలో మైనింగ్ స్టాఫ్, ఈపీ ఆపరేటర్ల సమస్యలపై ఒప్పందాలను చేసుకోనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు వైవీరావు, జూపాక రాంచందర్, కె.స్వామి, కందుకూరి రాజారత్నం, అరెల్లి పోశం, ఎల్.ప్రకాశ్, మాదన మహేశ్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారామయ్య

రాష్ట్ర ఉత్తమ టీచర్‌కు సన్మానం

జ్యోతినగర్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఎన్టీపీసీ రామగుండం జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయుడు అంజన్‌కుమార్‌ను శనివారం కార్పొరేటర్ కొలిపాక సుజాత సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.